# సిగ్గోస్వం

## భమిడిపాటి రామగోపాలం

"ఈ వర్షం ఎప్పటికి తగ్గుతుంది నాయనా!" అని విసుక్కుంది ఆ ముసిలావిడ.

ఆర్.టి.సి. బస్ స్టాండులో వున్న ఆరు పొడుగాటి బెంచీల్లో ఎక్కడా ఖాళీ లేకుండా జనం కూర్చున్నారు. కొందరు తెగించి నేలమీదనే చతికిల పడి వున్నారు. నేను మాత్రం బెంచి మీద హాయిగా నా సూట్ కేసుకి బురదా బుగ్గీ అంటుకోకుండా నా పక్కనే పెట్టుకు కూర్చున్నాను.

ఆ సూట్ కేసు అక్కణ్ణించి తీసేసి నేలమీద నా కాళ్ల కెదురుగా పెట్టకుంటే ఆ ముసిలావిడక్కూడా బెంచీ మీద చోటు అవుతుంది.

అది ఇష్టం లేకనే నేనలా సూట్ కేసుకి కూడా బెంచీ మీద స్థలం ఇచ్చాను. ఆవిడ బెంచీ అంచుకి చారబడి నుంచుంది.

అరగంటైంది, వర్షం అలా మొత్తుతూ.

బస్సుల డిపార్టుమెంటువాళ్లు నిర్మించిన ప్లాట్ ఫారాలు నేల నుంచి ఆరంగుళాల ఎత్తున వుండేవి, నేనూ ఆ ముసిలావిడా బస్సు దిగేసరికి. ఇప్పుడు రెండంగుళాల ఎత్తు మాత్రం మిగిలింది.

ఇంకో పావుగంట ఇలా వర్షం పడితే ఆ రెండంగుళాలూ భర్తీ అయిపోయి ప్లాట్ ఫారాల మీదుగా ఎక్కి నీళ్ల ఈ వెయిటింగ్ హాల్లోకి రావడం ఖాయం.

అప్పుడు నా సూట్ కేసు తడిసిపోడం ఖాయం.

అందుకే నా సూట్ కేసు బెంచీమీంచి తియ్యదల్చుకోలేదు.

రిక్షాలవాళ్లు ఈ లోపలికి రావడానికి వీల్లేకుండా ఆర్డర్సున్నాయి. వాళ్ల వెయిటింగ్ హాలుకి దూరంగా "ఇరవై అయిదు రిక్షాలు నిలుపు స్థలము" అని బోర్డు పాతిన చోట ఎవడి రిక్షాలో వాడు కూచున్నాడు.

నరిసింగరావు ఇంటికి వెళ్లాలంటే రిక్షాలో వెళ్లాలి. రిక్షాలో వెళ్లాలంటే రిక్షా వరకూ ఈ సూట్ కేసు పట్టుకుని నడిచి వెళ్లాలి.

సూట్ కేసు చాలా గొప్ప వంశంలో పుట్టిందే. దాని పేరు "ఆగర్భ శ్రీమంత". అయినా ఈ వర్షంలో దాని హేండిల్ ఓ చేత్తో పట్టుకుని నడిస్తే సందుల్లోంచి నీళ్ల లోపలికి వెళ్లిపోడం ఖాయం.

నరిసింగరావు ఇల్లు వెతుక్కోడం కూడా ఈ వర్షంలో ఒక సమస్యే.

"బస్టాండుకి దగ్గర్లో ఒక నాలుగు రోడ్ల జంక్షన్ వుంటుంది. దాన్నే ఈ వూళ్లో నాల్రోడ్ల జంక్షన్ అంటారు. కాని కూరల మార్కెట్ దగ్గిర మరో నాలుగు రోడ్ల జంక్షనుంది. అందులో ఉత్తరానికి వెళ్లే రోడ్డు మీద వంద గజాలు వెళితే కుడిచేతి వేపు ఒక సందు వస్తుంది. ఆ సందులో ఎడంవేపు నాలుగో ఇల్లు; మేడమీద వాటా మాది. ఆ ఇంటి గోడలకి పసుపుపచ్చ రంగు పెయింట్ వేసి వుంటుంది —" అదీ నరిసింగరావు నాకు ఉత్తరంలో రాసిన వర్ణన.

ఈ వర్షంలో రిక్షా ఎక్కినా, నేనూ నా సూట్ కేసూ తడిసిపోకుండా వుండడానికిగాను రిక్షావాడు టాప్ బిగించేస్తాడు. ఈ టాప్‌లు ఎవడు తయారుచేస్తాడోగాని నా లాంటి పొట్టివాడికి కూడా బుర్ర టాప్పుని తగుల్తూ వుండే విధంగా కడతాడు. దాంతో ఒద్దికగా ఒంగున్నట్టు కూచోవాలి. అయినా ఎక్కడి కెడుతున్నామో కనపడి చావదు. నాలుగు రోడ్ల జంక్షను, ఉత్తరంవేపు వెళ్లే రోడ్డు, మళ్లా కుడిపక్కకి సందు, సందులో నాలుగో ఇల్లూ, పసుపుపచ్చటి పెయింటూ .... ఏవీ కనబడకుండా దాటిపోయే ప్రమాదం వుంది.

వర్షం తగ్గిపోతే టాప్ లేని రిక్షాలో వెళ్లొచ్చు. అప్పుడన్నీ పద్ధతిగా చెక్ చేసుకుని సరిగ్గా నాకు కావలసిన చోట రిక్షా ఆపించుకోవచ్చు.

అందుకని వర్షం వెలిసిపోయేదాకా కూర్చుని వుండిపోవడానికే నిశ్చయించుకున్నాను. ఇంకా ఆరు గంటలవలేదు టైం.

* * *

హటాత్తుగా జ్ఞాపకానికొచ్చింది; నరిసింగరావు ఉత్తరంలో రాసిన ఫోన్ సంగతి. "మేడ మీది రెండు వాటాల్లో మా పక్క వాటా టాటా కంపెనీ సేల్స్ రిప్రెజెంటేటివ్ రంగారావుగారికి టెలిఫోనుంది. నువ్వు సడెన్‌గా ఈ వూరొస్తే ఎక్కణ్ణించైనా ఫోన్ చేసి నన్ను రమ్మంటే స్కూటర్ తీసుకుని వస్తాను. ఫోన్ నెంబరు కూడా చాలా సులువుగా గుర్తు పెట్టుకోవచ్చు- 4321."

నేను కూర్చున్న బెంచీకి ముప్ఫయి అడుగుల దూరంలో బస్సుల డిపార్టుమెంటువారి ఎన్‌క్వయిరీ కౌంటరు. అక్కడొక ఫోనుంది. అది కాక ఆ పక్కనే గోడకి బిగించి ఒక పబ్లిక్ టెలిఫోను.

పబ్లిక్ టెలిఫోను పనిచెయ్యకపోతే ఎన్‌క్వయిరీ వాళ్లని బతిమాలుకోవచ్చు.

ఎన్‌క్వయిరీ వాళ్లు "అట్నుంచొచ్చే కాల్స్ తీసుకోవడమే కాని ఇట్నుంచి ఎవరికీ ఫోన్ చెయ్యడానికి వీలవదు" అంటే?

అంటే దాని సిగ్గోసిరి.

ఇంత వర్షంలో కరెంటు సప్లయి పోకుండా వుండగా లేంది ఫోన్లు పనిచెయ్యకుండా పోతాయా?

జేబులో చిల్లర తీసి చూసుకున్నాను. ఫరవాలేదు. అర్థ రూపాయి నాణాలు మూడున్నాయి.

"నీ కివ్వవలసిన డబ్బుతెచ్చేను. వెంటనే స్కూటర్ తీసుకుని బస్ స్టాండుకి రా. వీలైతే నీకొకటీ, నాకొకటీ వాన కోట్లు తీసుకురా" అని చెప్పేస్తే నరిసింగరావు వచ్చి తీరతాడు.

పదకొండు వేలా? మజాకా?

పక్కకి చూశాను.

ఆ ముసిలావిడ ఇంకా అలా దీనంగా చూస్తూ ఏదో గొణుక్కుంటూనే వుంది. నే నావిడ వేపు చూసేసరికి ఆవిడా నా వేపు చూసింది.

"బాబూ, ఆ పెట్టి కింద పెట్టుకోరాదు? నిలబడలేక కాళ్లు లాగేస్తున్నాయి. పెద్దదాన్ని" అందావిడ.

"అలా ఏం కుదర్దు కాని, ఇక్కడ — అంటే నేను కూర్చున్నచోట కూచోండి. నేను లేచి, అదుగో ఆ టెలిఫోన్ దగ్గిరికెళ్లి రెండు నిమిషాల్లో వస్తాను. అప్పుడు ఆలోచిద్దాం —" అన్నాను.

"ఊళ్లో ఎవరో తెలిసిన వాళ్లున్నారు గావును."

"ఆ.. ఆ..." లేచాను. ఆవిడొచ్చి అక్కడ కూచుంది. "ఎవరైనా వచ్చి మీలాగే పెట్టె తీసి కిందపెట్టమంటే నేనిక్కడ కూర్చోవాలని చెప్పే వాళ్లె వరూ ఈ స్థలం ఆక్రమించుకోకుండా చూడండి."

"అలాగే, అలాగే!"

పెట్టె తాళం ఓసారి చెక్ చేసుకుని ఫోన్ వేపు



నడిచాను.

ఫోన్ డయల్ చేస్తూ ఇటు చూశాను.

ముసిలావిడ నేను కూర్చున్న సీట్లో చక్కగా స్థిరపడి పోయింది. పెట్టె మీద ఎడం చెయ్యి మోపింది.

ఈవిడ పెట్టె పట్టుకుని ఉడాయించదు.

ముసిలావిడ.

నిలబడీ నిలబడీ కాళ్ళు లాగేస్తూ వుండగా ఇప్పుడే కూర్చోవడానికి సావకాశం దొరికింది.

వర్షం.

గభాల్న లేచి పెట్టెతో సహా పరుగెత్తినా పది అడుగులు వేసే లోపుగా పట్టుబడిపోతుంది.

ఈవిడ పెట్టె పట్టుకుని ఉడాయించదు.

4321. ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్ ట్రిం-

"హలో—"

అర్థ రూపాయి బిళ్ళ, స్లిట్‌లో.

"హలో, ఫోర్ త్రి టూ వన్"

"థాంక్యు. రంగారావు గారేనా?"

"అవును. మీరెవరో తెలీడం లేదు."

"నా పేరు వెంకటాద్రి. నేను మీ పక్కవాటాలో వున్న నరిసింగరావు స్నేహితుణ్ణి. విజయవాడ నుంచి ఇప్పుడే వచ్చాను. బస్ స్టాండు నుంచి మాట్లాడుతున్నాను. ఒక్కసారి అతన్ని పిలుస్తారా, ప్లీజ్?"

"అలాగే అలాగే!... రమా, రమా! .. ..కావేరీ!.. లలితా!... ... ఎవరూ పలకరేమిట్రా?... నడుమూ!"

అప్పుడు మూసినట్టున్నాడతను మౌత్ పీస్.

4, 3, 2, 1 మొత్తం పది సెకెండ్లయింది.

"హలో సార్?" అన్నాడు.

"ఉన్నానండి."

'నర్సింగ్రావ్ గారు లేరండి; లక్ష్మిగారు కూడా లేరండి. నిన్న బయల్దేరి భీమవరం వెళ్లారటండి. రేపు ఉదయానికి వస్తారటండి."

"అయ్యో!"

"ఏమైనా చెప్పమంటారండి?"

"మీ దగ్గిర వారింటి తాళాలున్నాయా? నేనీ రాత్రి ఇక్కడ వుండిపోవాలండి."

"బస్టాండులో నాండి?"

"కాదండి; ఈ వూళ్లో నండి. మీ దగ్గిర మా నర్సింగరావు వాటా తాళాలుంటే అక్కడి కొచ్చేద్దా మని —"

"తాళాల్లేవండి. వారలా ఇయ్యరండి."

"పోనీ —" అన్నాను. "మా ఇంట్లో ఈ రాత్రికి వుండండి, దానికేముంది" అంటాడని ఆ ఛాన్సు, ఛాయిసు అతనికే ఇచ్చాను.

4, 3, 2, 1. మొత్తం పది సెకండ్లు ఖాళీ.

"వెరీ సారీ సార్. మా వాటా వారి వాటా కంటే చిన్నదండి. మేం ఉభయులం కాక ముగ్గురు ఆడ పిల్లలు, ఇద్దరు మొగపిల్లలూనండి. సారీ సర్."

"సరే సరే. రేపు ఉదయం వస్తాను. నా పేరు వెంకటాద్రి. నర్సింగరావు రాగానే నేను వచ్చేనని, అతనికి కావల్సింది తెచ్చేనని చెప్పండి. అతను నేనొచ్చే వరకు ఇల్లు కదలకూడదని గట్టిగా చెప్పండి. సారీ మీకు చాలా శ్రమ ఇచ్చేను."

"అబ్బే అబ్బే! థాంక్యు."

మళ్లీ బెంచి దగ్గిరికి వచ్చేసరికి ముసిలావిడ నవ్వుతూ పలకరించింది. "ఈ వూళ్లో వాళ్లతోనే మాట్లాడారా?" నా పెట్టె తీసి తన ఒళ్లో పెట్టుకుని బెంచీ చివరికి జరిగింది. నేను మొదట్నుంచీ కూర్చున్న స్థలం చూపించి కూర్చోమన్నట్టుగా సంజ్ఞ చేసింది.

"అవునండీ" అన్నాను కొంచెం మెత్తబడిన ధోరణిలో.

"మరి అంత గట్టిగా మాట్లాడేరేం? బస్ట్ స్టాండు మొత్తం వినిపించాయి మీ మాటలు" మళ్లీ నవ్వింది.

"ఏదో అలా అయిపోయింది. అదుర్దా—"

"మరి ఎక్కడుంటారు, పాపం ఈ రాత్రికి?"

"అదే ఆలోచిస్తున్నాను."

"ఏదైనా లాడ్జికి వెళ్తారుగావును" నవ్వుతోంది.

నా కసలే చిరాగ్గా వుంది. ఆవిడ వెటకారం ఒకటి. ఒళ్లు మండి "ఏం మీకూ లాడ్జి కావాలా?" అన్నాను.

చప్పున ఆవిడ మొహం మాడిపోయింది. "నా దగ్గిరేం వుంది నాయనా లాడ్జిలో దిగడానికి? ఏకైతే పెట్టె, వదులూ, మీ స్నేహితుడికి కావల్సిందేదో తెచ్చేవు.."

ఆవిడ ఒళ్లోంచి నా పెట్టె లాగేసుకుని నా ఒళ్లో పెట్టుకున్నాను. "ఏదో చేస్తాములెండి!" అన్నాను.

పది క్షణాలపాటు ఆవిడా, నేనూ మొహాలు చూసుకోలేదు. మాటలూ లేవు.

అప్పుడు ఆవిడ "నేనొకటి చెప్తానేమీ అనుకోవు కదా నాయనా?" అంది.

"చెప్పండి."

"పేద ముండని. నీకేమీ పెద్ద మర్యాద చెయ్యలేను కాని, ఈ రాత్రికి మా ఇంట్లో వుండు. నాకు కలిగిందేదో ఇంత వుడకేసి పెడతాను. నీ జోలికి ఎవరూ రాకుండా నీకు మా గది ఇచ్చేసి మేం వరండాలో పడుకుంటాం. నువ్వు లాడ్జికి ఇచ్చే దాంట్లో సగం ఇయ్యి చాలు. ఉదయం లేని గ్లాసుడు కాఫీ తాగి నీ దార్ని నువ్వు పోదువు గాని."

"మేం అంటున్నారు; మీరూ, మీ ఆయనానా?"

"అంత సౌభాగ్యం కూడానా బాబూ? నేనూ, నా కూతురూ వున్నాం. నీకిష్టం లేకపోతే వద్దులే పోనీ. ఏదో ఏలూరు నుంచీ నీతో కలిసి వచ్చాను. బస్సులో నిలబడి వుంటే దయతల్చి నీ పక్కని చోటిచ్చేవు. ఇక్కడా నీ పక్కని చోటిచ్చేవు. నీ స్నేహితుడు లేడు కదా ఈ రాత్రి నువ్వీ వూళ్లోవుండాలి కదా అని మా ఇంట్లో నీకు చోటిద్దామని అనుకున్నాను. ఈ వూరి లాడ్జిల సంగతి నీకు తెలీదేమో కాని నేను వింటూనే వున్నాను. డబ్బు కోసం మనుషుల్ని చంపేయడం అప్పుడప్పుడు జరుగుతూనే వుంది. అంచేత చెప్పేను కాని నాకింకో దురుద్దేశం, దుర్మార్గపు ఆలోచనా లేవు నాయనా."

పది క్షణాలు నాకేమీ తోచని స్థితి.

"పదండి" అన్నాను చివాలున లేచి.

"వర్షం తగ్గుతోంది లెండి, మీ పుణ్యమాని" అని ఆవిడ కూడా లేచింది.

రిక్షాల దగ్గరికి నడిచాం. రిక్షా ఆవిడే మాట్లాడింది. "కూర్చో బాబూ" అంది. "మీకింకో రిక్షా మాట్లాడుకోండి మరి!" అన్నాను. "అక్కర్లే" అని రిక్షా ఎక్కి నా కాళ్ల దగ్గిర ఆ తడిలో, బురదలో కూర్చుంది ఆవిడ. "ఒద్దు ఒద్దు. ఏది ఎలా వున్నా నాకన్నా పెద్దవారు. పోనీ ఇక్కడ నా పక్కనే కూర్చోండి. నేనేమీ అనుకోన్లెండి" అన్నాను. "ఫరవాలేదు. ఇంటికెళ్లగానే చీర తడిపి ఆరేసుకుంటాను."

* * *

రిక్షా అబ్బాయికి డబ్బులిచ్చేసి ఆవిడ వెనుక వెళ్లాను. ఆవిడ బొడ్డు చెంగులోంచి తాళంచెవి తీసి తలుపు తెరుస్తూ వుంటే ఆశ్చర్యం, అనుమానం కలిగాయి. "మీ అమ్మాయి వుందన్నారు?" అన్నాను. "లోపలుంది. రండి" అందావిడ.

కటకటాల వరండాలో కొంచెం సామానుంది. దాన్ని ఆనుకుని గది. గది తలుపు దగ్గిరగా వేసుంది. తలుపు తెరవగానే "అమ్మా! అమ్మా!" అంటూ ఒకామె ఈవిడ దగ్గిరగా వచ్చి కావలించుకుంది. "వచ్చావా? వచ్చావా? ఎంత వాన! ఎంత వాన! ఎక్కడో చిక్కడిపోయేవనుకున్నాను. ఎంత భయం వేసిందో" అంది.

"వచ్చేను తల్లీ. రాకుండా ఎలా వుంటాను?



యశోద కృష్ణులు : మారేమండ శ్రీనివాసరావు

మధ్యాహ్నం అన్నం తిన్నావా?" అని ముసిలావిడ ఆ అమ్మాయి ఒళ్లు, పొట్టా తడిమింది. ఆ అమ్మాయి అవునన్నట్టు తల ఆడించింది. అప్పుడు సూట్‌కేసు పుచ్చుకుని స్థాణువులా నిలబడివున్న నన్ను చూసి తల్లి కౌగిట్లోంచి విడిపడింది. దూరంగా జరుగుతూ "ఇతనెవరే అమ్మా?" అంది కుతూహలం, అమాయకత్వం, కొంచెం భయం ప్రదర్శిస్తూ.

ముసిలావిడ నావేపు తిరిగి నవ్వుతూ, "ఇతనా? ఇతను వెంకటాద్రిగారని మన వాళ్లేనమ్మా. ఈ వూళ్లో ఏదో పనుండి వచ్చేనూ; అతని స్నేహితుడెవరో వూళ్లో లేర్ట, రేపుదయానికి గానీ రారుట. మనింట్లో వుండి ఉదయం వెళ్లిపోతారు" అంది.

ఆ అమ్మాయిని పరీక్షగా చూశాను. పాతికేళ్లు దాటి వుంటాయి. ముప్పయి వుండవు. మెడలో బంగారం కాని, కాలి వేళ్లకి వెండి కాని లేవు. ఒంటి నిండా మాత్రం ఆరోగ్యం, పుష్టి, కాంతి — ఆ వాతావరణానికి అతీతమైన స్థాయిలో వున్నాయి. కాని ఆ అమ్మాయి మాట తీరు, ప్రవర్తన, అమాయకత్వమూ, పసితనమూ, తెలియనివిధంగా కనబడితే ఈ పిల్లని నెట్టుకు రావడానికి కష్టపడుతున్న ఆ తల్లినేనా, నేనింత సేపు అంత నిర్దయగా చూసేను అనిపించి గుండె మండింది.

"నీ పేరేంటి?" అన్నాను చిన్నపిల్లనడిగినంత సౌమ్యంగా.

"నిర్మల" అని నవ్వి రెండు చేతుల్తో నమస్కారం చేసి, నా దగ్గిరగా వచ్చి నా చేతిలో పెట్టె అందుకుని గది అంతా చూపులతో కలియబెట్టి చివరికి కిటికీ దగ్గిరికి వెళ్లి అందులో వున్న కొద్దిపాటి వస్తువులు ఒక పక్కకి తోసి, అక్కడ పెట్టింది. "హా! అవలివన్నీ ఇక్కడెందుకు?" అని పైటచెంగు బొడ్లో దోపుకుని, ఆ వస్తువులన్నీ ఏరి గదిలో ఓ మూల వున్న కావిడిపెట్టె పక్కని పడేసింది; చెత్తకుండీలో పులివిస్తరాకులు పడేసినంత నిర్లక్ష్యంగా. ఇంకొక గోడకి నిలువుగా చేరవేసి వున్న నవారు మంచం తెచ్చి కావిడిపెట్టె మీదుగా రెండు గోడల మూలకి వాల్చింది. గోడకున్న అలమార్లోంచి ఒక దుప్పటి, తలగడా తెచ్చి మంచం మీద అమర్చి నన్ను ఆ మంచం మీద కూర్చోమని సంజ్ఞ చేసింది. నేను కదలబోతూ వుంటే, "ఆగండాగండి. కాళ్లు కడుక్కోకుండానే మంచంమీద కూర్చుంటారా?" అంది కళ్లు పెద్దవి చేసి. "అమ్మా, నువ్వైనా చెప్పొద్దూటే?" అంది. ఇంత చక్కగా వున్నా ఈ అమ్మాయికి పెళ్లి ఎందుకు కాలేదో నాకు ఆ క్షణం అర్థమైపోయినట్టు స్ఫురించింది.

* * *

వాళ్లిద్దరూ వరండాలో చాప వేసుకుని పడుకున్నారు. కనుక నా భద్రత కోసం నేను గది తలుపు లోపల గడియ పెట్టేసుకోవచ్చు. కాని ఇద్దరూ ఆడవాళ్లు. ఒకతె ముసలిది, ఒకతె పసిది. వాళ్లు నన్నేం చేస్తార్లే అని ధైర్యం. ఏమో, నిద్ర పోయాక ఏ కత్తిపీటో తెచ్చి నా పీక తెగ్గోసి ఈ పదకొండు వేల రూపాయిలు కాజేస్తారేమో?... కాజేసి? ఆ తరువాత నా శవాన్ని ఎలా వదిలించుకుంటారు?... వెధవ ఆలోచన్లు. నా దగ్గిర డబ్బు లేకపోతే నా ఆలోచన్లు ఇలా వుండేవా?... అసలు నా దగ్గిర డబ్బు వున్నట్టు, అంత ఎక్కువ వున్నట్టు ముసిలి దానికి తెలుసునా ఏం?... ఎంతో ఎక్కువ అక్కర్లేదు. వంద రూపాయిల కోసం హత్యలు జరిగిన ఉదంతాలున్నాయి... ఇంత తక్కువకి కూడా —

వంకాయ కూర, ఈ పూట చేసింది పెట్టారు. ఉదయం వండింది ముక్కల పులుసు వడ్డించారు. ఎప్పుడెప్పుడో పెట్టిన ఊరగాయ తినిపించారు. "అమ్మా, నెయ్యి నేను వడ్డిస్తానే; అమ్మా, అమ్మా! ఆయనికి మజ్జిగలోకి అన్నం నా చేత్తో పెడతానన్నావా— పోన్లే, నువ్వెప్పుడూ ఇంతే. నా సలహా వినండి; మరేం, మజ్జిగన్నంలోకి పులుసులో ముక్కలు మాంఛి రుచి. ఆవకాయ యాక్కు. అన్నట్టు మర్చిపోయాను. వంటింటి గూట్లో దేముడికి నైవేద్యం పెట్టిన అర్టిపండుంది కదమ్మా, తెచ్చి వొల్చి ఆయనకి వెయ్యనేం?—" ఇలా మాట్లాడుతూ భోజనం చేయించిన ఆ "నిర్మల"నూ, ఆ అమ్మాయి కోసం ప్రాణాలు మోస్తున్న ఆ ముసిలావిడనూ ఇంత నీచమైన అనుమానాలపాలు చేస్తున్న నరసింగరావుగాడి డబ్బుమీద కోపం, జాలి కలిగి మనసును మథించాయి.

ఆఖరికి—

తలగడా ఎత్తు చాల్లేదని నెపం పెట్టి సూట్‌కేసు తలగడ కింద పెట్టుకుని, తలుపులు గడియ బిగించకుండానే పడుకున్నాను. కాని, ఎంత చంపుదామనుకున్నా చావని ఆలోచనలు — డబ్బూ, హత్యలూ మాత్రమే కాక మిగిలినవెన్నో రకాలు ఎన్నో ఆలోచనలు నా నిద్రను కలత పెట్టేయి.

"నిద్దరపోతున్నారా?" అని చెవిదగ్గర చిన్నగొంతుతో అడిగింది తప్పకుండా నిర్మలే అయి వుంటుంది. ఠకీమని లేచి కూర్చుని దూరంగా జరిగాను. నిర్మల నిస్సంకోచంగా మంచం ఎక్కి కూర్చుని "నేను కూడా

ఇక్కడే పడుకుంటాను" అంది నవ్వుతూ. ఆ నవ్వులో నికిలితనాన్ని చూపించిన బెడ్‌లైటు కాంతిమీద చిరాకు కలిగి ఆ నవ్వులో పసితనంకోసం, అమాయకత్వంకోసం వెతకాలని కాబోలు; నేను మంచందిగి పెద్దలైటు స్విచ్చి వేశాను.

"పడుకునేటప్పుడు అంత లైటొద్దు. నాకు బావుండదు" అంది నిర్మల రెండు చేతుల్తో మొహం కప్పుకుంటూ.

"నా కలాగే ఇష్టం" అన్నాను. ఆ అమ్మాయి ఇలా రావడం — లేకపోతే ఆ అమ్మాయిని వాళ్ళమ్మ ఇలా రానివ్వడం — భరించలేకపోతున్నాను. ఇందులో నాకో, ఆ అమ్మాయికో పెద్ద ప్రమాదం వుంది కదా.

"పోనీలెండి" అని మొహంమీంచి చేతులు తీసేసింది నిర్మల. "మీకెలా ఇష్టమో నాకూ అలాగే ఇష్టం. మరి మొగుడు కిష్టమైనట్టే పెళ్ళాం మసులుకోవాలి కదా" అని బుంగమూతి పెట్టింది.

నేను ఆ కొత్త భంగిమ చూస్తూ ఆ కొత్త వ్యాఖ్యానాన్ని మనసులో చర్చకు పెడుతూ మాట్లాడలేదు.

"అమ్మ చెప్పింది లెండి. మీరు నన్ను పెళ్ళి చేసుకుంటార్టగా?"

"అలాగా."

తల నిలువుగా ఆడించింది. "నాకు పెళ్ళయిపోతే మా అమ్మకి కష్టాలు తీరిపోతాయి. అప్పుడెప్పుడో అయిపోవలసింది నా పెళ్ళి. కానీ నారాయణమూర్తి పెళ్ళాం నొప్పుకోలేదు."

"నారాయణమూర్తెవరు?" అని మంచం ఒడ్డున కూర్చున్నాను.

"మీకు తెలీదు? నారాయణమూర్తి ఎంత మంచివాడో. సేల్‌టాక్స్ ఆఫీసులో పని. మీ బెజవాడలోనే వుంటున్నాడు. నన్నెంత బాగా చూసుకునేవాడో చెప్పలేను. ఏం లాభం? పెళ్ళి చేసుకోమని మా అమ్మ ఎంత చెప్పినా వాళ్ళ నాన్నగారు ఒప్పుకోడంలేదని అనేవాడు. కానీ అసలు సంగతి నాకు కడుపొచ్చేక తెలిసిపోయింది. ఇంకా ఎన్నాళ్ళు ఆగమంటావు, రేపు నలుగురూ నన్ను చూసి నవ్వరా, అని అడగడానికి వాళ్ళింటికి వెళ్తే ఇంకేముంది? నారాయణమూర్తి పెళ్ళాం నన్నూ, మా అమ్మనీ చీపురుకట్టతో కొట్టి తరిమేసింది. మీరే చెప్పండి; నారాయణమూర్తికీ ఇష్టమే, నాకూ ఇష్టమే. మధ్యని అదెవత్తె, నా కిష్టం లేదూ, నువ్వుపో అని చెప్పడానికి?" అంటూ ఒక్కసారిగా గుండెలవిసేలా ఏడుస్తూ నా మీద పడిపోయింది నిర్మల.

ఎందుకు వచ్చాను, ఏం చేస్తున్నాను? ఇదంతా చీఁకిన పోయేది చీపుకు రాసుకోడం అవుతుంది. నేలమన్నది తీసి నెత్తికి రాసుకోడం అవుతుంది. ఈ నిర్మలను (నేను కూడా) "పెళ్ళి చేసుకుంటానులే" అని బుజ్జగిస్తే ఈ పది క్షణాలూ ఆనందంగా గడిచిపోవచ్చు. కాని నారాయణమూర్తి పెళ్ళాంలాగానే నా భార్య కూడా ప్రశ్న వచ్చినప్పుడు అంతకీలంతా వెళ్ళు పెట్టేస్తుంది కదా అదంతా అలా వుంచి నిజంగా నేను ఈ పిచ్చిముండని పిచ్చిదే కదా ధీనికేం తెలుసు, నేనేం చేసినా అని ఏమైనా



"దీపాలు వెలగాలి చీకట్లు తొలగాలి" — వెల్లటూరు పూర్ణానందశర్మ

చేస్తే ఇంత రాత్రి అయిందనైనా సంకోచించక వాళ్ళమ్మ ఎవర్నెవర్నో పిల్చుకొచ్చి పంచాయితీ పెట్టి అల్లరి చేస్తే? వాళ్ళందరూ ఉద్రేకపడి నన్ను నాలుగు తన్ని నా పెట్టె నేలకేసి కొట్టి అప్పుడు అందులోంచి రాలిపడిపోయే పదకొండు వేల రూపాయిలనూ తలా కాస్త చొప్పున పంచుకుని పారిపోతే అనువుగాని చోట అధికుడ ననగలుగుదునా?

ఉన్నట్టుండి లేచి గది బైటికి వచ్చాను. తలుపు బయట గొళ్ళెం పెట్టి, లైటు స్విచ్చి వేశాను. ముసిలావిడ చాపమీద పడుకుని వుంది. దీపం వెలగగానే; మోకాళ్ళ వరకు తొలగిన చీరను పాదాల వరకు లాక్కుంది. నిద్రపోవడంలేదని స్ఫురించి "మీరోసారి ఇలావొస్తారా?" అని లైటార్పి రోడ్డుమీదికి వెళ్ళబోయాను.

ఆవిడ ఎంత వేగిరం లేచిందో మరి — గుమ్మం మెట్టు దిగకముందే నా చెయ్యి పట్టుకుని ఆపింది. "మీ పుణ్యమాయెను, మా గుట్టు రట్టు చెయ్యకండి బాబూ" అంది నెమ్మదితనంతో, బొంగురుపోయిన గొంతుకతో. "రోడ్డుమీద మనం ఇద్దరం ఇంత రాత్రప్పుడు ఏమిటి మాట్లాడుకున్నా సరే, చూసే వాళ్ళకి తట్టేది ఒక్కటే. ఇలా కూచోండి" అంది గుమ్మంమీద చతికిలపడుతూ.

నేను ఆవిణ్ణి రోడ్డుమీదికి తీసుకెళ్ళి గట్టిగా కేకలేస్తూ ఆవిడని చీవాట్లు పెడదామనుకున్నాను. నేను అరిచి మాట్లాడేమాటలు నిర్మలకి వినపడకూడదని మాత్రమే నా కోరిక.

"ఎంత పేదరికం వున్నా సరే, మీరిలా చెయ్యడం చాలా తప్పు" అన్నాను. నెమ్మదిగా నిర్మలకి వినపడకూడదన్న కోరికతో మాట్లాడ్డంవల్ల నా మాటలు మందలింపులా కాక ప్రబిమిలాటగా వినబడ్డాయి నాకే.

ఆవిడ రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టి "చిన్నవాడివైనా సరే నీకు చేతులెత్తి మొక్కుతున్నాను. కూచుని నా మాటలు కొంచెం వినండి" అంది.

నేను ఆవిడ పక్కనే కూర్చున్నాను.

"నన్ను నమ్మండి. దాన్ని మీ దగ్గరికెళ్ళమని నేనే పంపేను. అయినా మీచేత ఎలాగో కానిపని చేయించేసే వుద్దేశంతో కాదు. ఆ వెధవ, ఆ దొంగపీనుగు నారాయణ మూర్తి దాన్ని మోసం చేసిన దగ్గిర్నుంచీ దానికి చిత్రమైన జబ్బు పట్టుకుంది. అంతకుముందల్లా గడు సుగా గడుగ్గాయిగా వుండేది. ఆ ఎబార్షన్ చేయించిన తరవాత పిచ్చిముండలా, పిల్లముండలా తయారై పోయింది. కడుపుపోయిన పిల్ల కాద అయిపోడం చూసేను గాని కండపట్టి రంగుతేలడం యెన్నడూ చూళ్ళేదు. ఇటు వొంటికి రంగూ, కండా వొస్తూంటే అటు మనసు పిచ్చిగానూ, పిల్లతరహాగానూ అయిపోయింది. డాక్టరుకి చూపించమన్నారు ఎరిగున్న వాళ్ళందరూనూ. బెజ వాడలోనే వుంది క్రిష్టియన్ డాక్టరు మార్గరెట్టని. ఆవిడ ఐదు రోజులపాటు అన్నీ పరీక్ష చేసి, అంతా కనుక్కొని ఆఖరికి చెప్పిందేమిటంటే, ఆ పిల్లకి పెళ్ళయి మొగుడితో కాపురం చేస్తే మళ్ళా మామూలుగా అయిపోతుం దని. అమ్మా! మరి ఈ జన్మకి ఆ యోగ్యత లేదు తల్లీ అని మొరపెట్టుకున్నాను. అప్పుడావిడ చెప్పింది కదా! పోనీ పెళ్ళి చెయ్యలేకపోతే పోయారు, నెలకో రెండు నెలలకో, అవకాశం దొరికినప్పుడో ఈ పిల్లకి మొగవాడి పొందు కలిగేలాగ చూడండి, లేకపోతే ఈ పిచ్చి ఇలాయిలా ముదిరిపోతుందంది. ఏ వయసులో జరగ వలసిన ముచ్చట ఆ వయసులో అని మనవాళ్ళు అంటారు చూడండి ఆ మాటే ఆవిడ మరో రకంగా చెప్పింది. ఆవిడ అమెరికా గట్రా వెళ్ళిగొప్పగా తరిఫీదు అయి వొచ్చిందే తప్పా అల్లాటప్పా కాదు. ఆ తరువాత మూడు నెల్లకి వో రోజు నారాయణమూర్తి ఈ వూరికి ఏదో పనిమీద వొచ్చినవాడు — మా ఇంటికి రాలేదు సుమండీ — బజార్లో కనబడి మొహం తప్పించుకు పారిపోతూవుంటే మెల్లిగా పిల్చి కబుర్లలో పెట్టి ఇంటికి తీసుకొచ్చి ఆ రాత్రికి అతన్ని ఆపేను. మర్నాటి నుంచి మళ్ళా రెండు నెల్లదాకా ఒకటే హెత్తారి, పిల్లకి. మార్గరెట్ డాక్టరమ్మ చెప్పిందాంట్లో నిజం అప్పుడు కనబడింది. పోనీ మీ దయవల్ల ఈ రాత్రికి మరో అర గంటో గంటో దానికి కులాసాగా గడిచిందంటే మరో రెండు నెల్లపాటు పిల్ల వుషారుగా కళకళ్ళాడుతూ తిరుగుతుందని ఆశపడ్డానంతే తప్పా; కన్న కూతుర్ని నీ పక్కలోకి తార్చి నువ్వో యాభయ్యో, వందో ఇస్తే పబ్బం గడుపుకుందామని ఉద్దేశం కాదు నాయనా."

ఎక్కడో చదివేను, ఇలాంటి జబ్బులు వుంటాయని.

ఆవిడ చెప్పింది నమ్మాలా, వద్దా అన్నది కాదు సమస్య.

పేదరికం ఎంత పనైనా చేయిస్తుంది అన్నది నమ్మి తీరాలి కదా.

"అంచేత, వెంకటాద్రి తండ్రీ, నీకు ఇష్టం వున్నా, లేకపోయినా సరే, నా కూతురి బతుకులో ఇన్ని పువ్వులు

జల్లుతావని, కొన్నాళ్ళపాటు ఆ వాసనతో అది కళకళ్ళాడుతుందని ఆశపడ్డాను నాయనా. నా మాట తీసెయ్యక దానికి నీ దయ కొంచెం పంచిపెట్టు; ఇంతకన్నా ఇంకేమీ అడగను'' అని మళ్ళీ రెండు చేతుల్తో నమస్కారం పెట్టి ఆ రెండు చేతుల్తో నా రెండు చేతుల్ని పట్టుకుని మెల్లిగా వూపింది. ''తెల్లారగానే నీ దార్ని నువ్వు వెళ్ళిపోతావు. ఇంక ఆ తరవాత నువ్వెవరో, తనెవరో. నీ బాధలు నీవి మా ఖర్మ మాది.''

*** ** ***

మంచంమీద బోర్లాపడుకుని, మోకాళ్ళమీదుగా పాదాలు పైకెత్తి గాల్లో వూపుతూ బహుశా ఏదో పుస్తకం లాంటిది చూసుకుంటూ మురిసిపోతోంది నిర్మల. తలుపు తీసి అటు చూసేసరికి. తెల్లగా, నున్నగా, పుష్టిగా కనిపించినంత మేరకి చూస్తే ''ఆ తల్లిపేరుగ వ్యాపారం చెయ్యాలని సంకల్పించాలే గాని ఈ నాంటి మీద కనకవర్షం కురవదూ!'' అనిపించింది.

''ఇదుగో చూశారా, నారాయణమూర్తి, నేనూ తీయించుకున్న ఫోటో, అతను వొద్దువొద్దు అంటున్నా సరే నేను నేనే అతనికి తీయించింది ఈ ఫోటో. ఎంత బావుంటాడో కదూ?'' అని నా చేతుల్లో అప్పుడే వుంచిన ఫోటో, అప్పుడే లాగేసుకుని ముద్దుపెట్టుకుంది.

నారాయణమూర్తిది ఎక్కడో చూసిన మొహమేలా వుంటుంది. నిజంగానే చాలా బావున్నాడు. కమర్షియల్ టాక్స్ ఆఫీసులో పని అని చెప్పింది. ఓసారి రంగ రాజుగారికి ఫోన్‌చేసి రప్పించి నాలుగు చివాట్లు వెయ్యాలనిపిస్తోంది.

కాని, అది నాకు అనవసరం. పెళ్ళాం వుండగా పర స్త్రీలనీ, కన్నెపిల్లల్నీ తెలుసుకోవాలనీ, పొందలనీ అనుకుని కోరుకుని సాధించే అశేష పురుష జనావళిలో అత నొకడు.

''ఇంకా చాలా వున్నాయే, ఫోటోలు?'' అని ఆ




దొంతర అందుకున్నాను. వెంటనే లాగేసుకుంది. ''కూచోండి. నేనే చూపిస్తాను'' అని మంచంలో ఒక వారగా కూర్చుని ఫోటోల దొంతర వొళ్ళో పెట్టుకుని ఓ చేత్తో చీర సర్దుకుంది. నేనామె పక్కనిన తగిలీ తగలనట్టు కూర్చున్నాను.

''ఇదుగో చిన్నప్పుడు నేను — ఇదుకో మా నాన్న గారు, మా అమ్మ, మా అన్నయ్య, నేను — ఇదిగో మా అన్నయ్య, నొదిన.''

''బావున్నాయి ఫోటోలు!'' అన్నాను. వాళ్ళన్నయ్య, నొదిన వున్న ఫోటో అందుకుని పరీక్షగా చూస్తూ, పరధ్యానంగా వేసినట్టు నిర్మల భుజంమీద ఓ చెయ్యి వేసి.

ఇతను రాధాకృష్ణమూర్తిలా వున్నాడు, అచ్చం.

రాధాకృష్ణమూర్తి అని మా ఫ్యాక్టరీలో ఫైనాన్స్ డివిజన్‌లో జూనియర్ మేనేజరు. యూనియన్ లీడరు. గొప్ప వక్త, సంఘ సంస్కర్త, అభ్యుదయవాది, కవిత్వ ధోరణిలో కథలూ, నవలలూ రాయగల భావుకుడు.

''ఇదుగో, మా అన్నయ్యది ఇంకో ఫోటో'' —

రాధాకృష్ణమూర్తిది కొంచెం పెద్దవుద్యోగమే అయినా ఫ్యాక్టరీ కార్మికుల కాలనీలో స్థిరపడి ఎన్నో మంచి పనులు చేసేడు. స్కూలు అంతకుముందే ఉన్నా, దానికి స్వంత బిల్డింగు, ఆ ఆవరణలోనే ఒక లైబ్రరీ పెట్టించడం అతని కృషే. ప్రభుత్వ సారా దుకాణం ఎత్తించేశాడు కాలనీలోంచి. అన్నిటికీ మించి ఒకసారి మా కన్వేయర్ తెగిపోయి పెద్ద లోడ్ కిందపడిపోయినప్పుడు ఒకేసారిగా చనిపోయిన పన్నెండుమంది కార్మికుల కుటుంబాల కోసం అతను యాజమాన్యంతో గొప్ప తగువు పెట్టుకుని, వాదించి, బెదిరించి చివరికి ఆ విధవరాళ్ళ కందరికీ జీవనోపాధి ఏర్పాటుచేయించడం పది కాలాలపాటు చెప్పుకోతగింది.

''మీ అన్నయ్య పేరేంటి?''

''రాధాకృష్ణ!'' అంది నిర్మల, నాకింకా దగ్గిరిగా జరుగుతూ.

''మంచివాడు! ఏం?''

నిర్మల మొహంలో అంతసేపూ వున్న మెరుపు మాయమైంది. ''మంచివాడా? ఛీ! పరమదుర్మార్గుడు!'' అంది, ఫోటోలన్నీ లాక్కుని నేలకేసి కొట్టి కళ్ళెర్రచేసి.

కావచ్చు.

కొందరు ఇళ్ళలో మహాపురుషులట, బయట కర్కోటకులు.

కొందరు బయట అవతార పురుషులు, ఇళ్ళలో కిరాతకులు.

''మా అన్నయ్య ఎం.కాం. చదివి, అది చాలక చార్టర్డ్ అకౌంటెంట్ అవుతానంటూ ఆ కోర్స్ చదివి,




మంచి ఉద్యోగం సంపాదించుకున్నాడు. దానికోసం మా నాన్న సంపాదనా మా అమ్మ బంగారం ఖర్చుపెట్టేశాడు. నలభై వేలు కట్నం తీసుకునీ కూడా మాది ఆదర్శ వివాహం గుడ్డూ గూసూ అని కబుర్లు చెప్పి మీటింగులు పెట్టించుకుని పొగిడించుకుని పువ్వులదండలు వేయించు కున్నాడు. ముప్ఫయ్యయిదేళ్ళ వయస్సు రాకముందే బెజవాడలో స్థలం కొని లక్షాయాభైవేలు చేసే ఇల్లు కట్టుకుని, కిందనున్న రెండు వాటాలూ అద్దెకిచ్చేసి మేడమీద కాపురం వుంటున్నాడు. మళ్ళీ పైసా పైసా కూడబెట్టి మరో లక్ష రూపాయిలు పోగుచేసేడు. ఏం లాభం? తను తినడు, ఒకళ్ళకి పెట్టడు. స్టేజి ఎక్కి ఉపన్యాసాలిస్తాడు ఈ దేశంలో స్త్రీలు అభివృద్ధి చెందిన నాడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టని, ఆడవాళ్ళని గౌరవించడం నేర్చుకున్న మొగవాడే నిజమైన పౌరుడని. మమ్మల్ని ఇంట్లోంచి తగిలేశాడనే కాదు, వాళ్ళు అంటే అతనూ మా వొదినా, కొడుకూ — ఓ పూట తింటే ఓ పూట తినరు. కూలీల యూనియన్ మీటింగుల్లో ఏ పురాణంలోనూ లేనన్ని నీతులు చెప్తాడు. మీ జీతాలు పెంచమని చెప్పడానికి ఢిల్లీ వెళ్తాను అని రానూపోనూ విమానం ఖర్చులూ, ఢిల్లీలో బస ఖర్చులూ చందాలు పోగుచేసి పట్టుకుపోయి ఢిల్లీలో జల్సా చేసి "మీ జీతాలు వచ్చే యాడాది పెంచుతారు. అంతవరకు ఓపికపట్టండి" అని చెప్పేస్తాడు. యూనియన్నిఅంతంత మాత్రంగా ఉంచమనీ విజృంభించకుండా చూడమనీ చెప్పి కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గారిచ్చే లంచం నిర్భయంగా, సిగ్గు వొదిలి పుచ్చుకుంటాడు. ఛీ! వాడి పేరు తల్చుకుంటేనే రోత! — ఆ రోజు, నారాయణమూర్తి పెళ్ళాం నన్నూ, అమ్మనీ చీపురుకట్ట పుచ్చుకుని కొట్టి తరిమేస్తే "ఏడింటికి" వెళ్ళాంకదా. సినిమాకివెళ్ళొస్తాం కూచోండని చెప్పి ఇంటి తాళాలు పట్టుకుపోతూ వరండాలో చాప ఒకటి పడేసి అర్ధరాత్రి దాటాక తిరిగొచ్చి మొగుడూ, పెళ్ళాం ఇంట్లో దూరిపోయారు; భోజనం చేశారా అనైనా అడక్కుండాను. ఈ ఏడెనిమిది నెలల్నుంచీ వచ్చేనా, బతికే ఉన్నానా అని ఒక్కమాటు పలకరించలేదు. మనస్సులోనైనా తలచలేదు......వాడా మంచివాడు? వాడా, అన్నయ్య? చెప్పండి మీరే చెప్పండి బాబూ —"

తల్లి అనుమతితో మొగవాడితో ఏకాంతం; తెచ్చి పెట్టుకున్నదైనా మొగవాడి ఆత్మీయత; గొప్ప కళాస్థానాల్లో కాకపోయినా మొగవాడి స్పర్శ నిర్మల మాట ధోరణిలో నిమిషాలమీద ఎంత మార్పు తెచ్చిందని మొదట...

ఇటు మేనేజిమెంటు దృష్టిలో, అటు కార్మికుల దృష్టిలో అత్యంత మిక్కిలి శ్రేష్ఠ, గొప్పమంచివాడని కీర్తి పొందగలిగేటంత జనోపయోగ కార్యధారి రాధాకృష్ణమూర్తి తన స్వంత చెల్లినీ, కన్నతల్లినీ ఇంత దీనస్థితికీ, పతనావస్థకీ వదిలేశాడెలాగా అని తరవాతా—

నేను తెల్లబోయాను.

ఏమైనా సరే, రాధాకృష్ణమూర్తి చెల్లెలితో నేను "మిస్ బిహేవ్" చెయ్యలేను గాక చెయ్యలేను......




"ఇప్పుడవన్నీ ఏం కబుర్లే, దీపం ఆర్పేసి పడుకోక?" అంది ముసిలావిడ తలుపు కొద్దిగా తెరిచి, అందులో తలపెట్టి —

నేను చివాలున లేచాను. రెండు నిమిషాల్లో నా ప్రయాణం బట్టలు తొడిగేసుకున్నాను. లుంగీ, తువాలు సూట్‌కేసులో కుమ్మేసి, తాళం వేశాను.

"వెళ్ళిపోతారా?"

"రాత్రిపొద్దు నాయనా. భయం —"

"మీ వూరే వెళ్ళిపోతారా లేకపోతే —"

"ఇంత రాత్రప్పుడు లాడ్జీల్లో కూడా గదులివ్వరు నాయనా."

"మళ్ళీ ఎప్పుడొస్తారండి?"

"మా వల్ల తప్పే జరిగింది క్షమించండి బాబూ. మీరెళ్ళిపోవద్దు. తెల్లవారే వరకు వుండి వెళ్ళండి" మీకి గదిలో నిద్ర రాకపోతే పోనీ వరండాలోనే మంచం వేస్తాను. మిమ్మల్ని మేం ఏమీ మాట్లాడించం —"

జేబులు చూసుకున్నాను. నాలుగు వందల యాభై రూపాయిలున్నాయి. టైమ్ చూశాను. పదకొండున్నర. యాభై రూపాయిలు వుంచుకుని, నాలుగు వంద రూపాయిల కాగితాలు తీసి పట్టుకున్నాను. "నేను వెళ్ళొస్తానండి. మీరు ఆదరంగా, అభిమానంగా పెట్టిన భోజనం, కొసిరి కొసిరి తినిపించిన విధానం నాకు శాశ్వతంగా గుర్తుంటాయి. తల్లి పాలకి విలువ కట్టేటంత కర్కోటకుణ్ణి కాదుగానీ, ఇవి నా దగ్గర అవసరానికి మించి వున్నాయి, మీకు కొన్నాళ్ళపాటు పనికొస్తాయుంచండి" అని ముసిలావిడ చేతిలో పెట్టి నా చేత్తోనే ఆవిడ పిడికిలి మూయించాను. "రాధాకృష్ణమూర్తీ, నేనూ ఒకే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాం. నేను రేపే అతన్ని పిలిపించి తగిన విధంగా నచ్చజెప్పి మీరిద్దరూ ఇలా దిక్కూమొక్కూలేని వాళ్ళలా విడిగా వుంటూ అడుక్కునీ, పడుక్కునీ సంపాదించనక్కర్లేకుండా ఏదో ఏర్పాటుచేస్తాను" అని సూట్ కేస్ చేత్తోపుచ్చుకుని గబగబా నడుస్తూ ఆ ఇంట్లోంచి బైటపడ్డాను.

రేపే, రాధాకృష్ణని పిలిపించాలి......

***     **     ***

నేను రాధాకృష్ణమూర్తిని పిలిపించడం కాదు, అతనే నన్ను పిలిపించాడు. ఆ సాయంకాలం మా ఫ్యాక్టరీ కార్మికులంతా రాధాకృష్ణమూర్తి యూనియన్ ప్రెసిడెంట్ పదవి పదో వార్షికోత్సవం ఏర్పాటు చేసి; ఆ సందర్భంగా అతన్ని పుష్పమాలలతోనూ, యోగ్యతాపత్రంతోనూ సన్మానించడానికి ఆహ్వానించిన మా ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌కి హఠాత్తుగా ఢిల్లీ ప్రయాణం తగలడంతో ఆ ముఖ్యఅతిథిత్వం జనరల్ మేనేజర్ తరువాత అంతవాడినైన నా పాలబడింది.

"...... ...... కాబట్టి, సోదర సోదరీమణులారా! ఈనాడు మన ఫ్యాక్టరీ ఇటు ఉత్పత్తిలోను, అటు కార్మిక సంక్షేమంలోను ఎన్నో ముందంజలు వేసి ఎన్నో సంస్థలకి మార్గదర్శకంగా రూపొందిందంటే అందుకు మన ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్ జూనియర్ మేనేజర్‌గా వుంటూ తన ఉద్యోగ బాధ్యతల్ని — నిశితమైన చాతుర్యంతో, నిబిడీకృతమైన సామర్థ్యంతోనిర్వహిస్తూనే తన అమేయ మేధాశక్తిని కార్మిక సంక్షేమం కోసం కూడా వినియోగించగలుగుతున్న రాధాకృష్ణమూర్తిగారే కారణం అని నేను మీకందరికీ సవినయంగా మనవిచేస్తు న్నాను. ఇతను చిన్న వయసులోనే బహుజన సుఖం, బహుజన హితం సాధించిన భరతమాత ముద్దుబిడ్డల్లో ఒకరయ్యారని నేను మీఅందరి తరఫునా గర్వపడుతున్నానని చెప్పడానికెంతో సంతోషిస్తున్నాను. ఇటువంటి ఉత్తమ వ్యక్తిని కన్నతల్లి నిజంగా ఎంతో ధన్యురాలని; ఇతని వ్యక్తిగత బాధ్యతల్ని, బరువుని నిరంతరంమోస్తున్న ఇతని శ్రీమతి ఎంతో గొప్ప దేశసేవిక అని, ఇతని రక్తం పంచుకుపుట్టిన చెల్లెలు ఎవరైనా ఉంటే ఆమె కూడా ఎంతో అదృష్టవంతురాలని, వారందరిపైనా కూడా శ్రీ రాధాకృష్ణగారు అరయన్ శంతనుపుత్రుపై అక్రూరుపై కుబ్జపై — అన్నట్టుగా తన ప్రేమాభిమానాలను కొంత కొంతగా ప్రసరింపజేసి పరిపూర్ణ మానవుడు కావాలని నేను హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను!" అని గొప్ప ఉపన్యాసం పేల్చాను. అతన్ని కావిలించుకుని పూమాలతో అలంకరించాక......

కార్యక్రమం అయిపోగానే రాధాకృష్ణమూర్తి నాకు షేక్‌హాండ్ ఇస్తూ, "థాంక్యూ సార్! థాంక్యూ!! మీ పరిశోధనా చాపల్యానికి ఇవే నా జోహార్లు!!!" అని నా ముందు నడుమూ, తలా వంచాడు.

*(డాక్టర్ టి.ఆర్.శేషాద్రిగారికి కృతజ్ఞతలతో)*

